సరికొత్త వెలుగులకు శ్రీకారం

- నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్
- ఉపకేంద్రాల విస్తరణ పనులు ప్రారంభం
- రూ.22 కోట్లతో అభివృద్ధి

తుని రూరల్: నిత్య జీవితంలో విద్యుత్ వినియోగం ఓ భాగమైంది.. ఏ పనికైనా ఆధారమైంది.. అలాంటి విద్యుత్ వ్యవస్థలో లోపాలను సరిదిద్ది సరికొత్త వెలుగుల దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.. వ్యవసాయ, పారిశ్రామిక, జగనన్న కాలనీల్లో మెరుగైన విద్యుత్ సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టింది. పెరుగుతున్న అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 132/33, 32/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి పూనుకుంది. రూ.22 కోట్లతో చేపట్టిన ఈ ఉపకేంద్రాల నిర్మాణం పూర్తయితే తుని నియోజకవర్గంలో లోఓల్టేజీ సమస్యకు బ్రేక్ పడుతోంది. దీంతో పాటు వ్యవసాయ, పారిశ్రామిక, గృహావసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగనుంది. నియోజకవర్గంలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు, ప్రజల విద్యుత్ అవసరాలు తీర్చేందుకు రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఈ పనులు చేపట్టినట్లు ట్రాన్స్‌కో అధికారులు పేర్కొన్నారు.


హంసవరంలో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు భూమిని చదును చేస్తున్న సిబ్బంది


రాజుపేట శివారు జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

పనులు ఎక్కడెక్కడ అంటే..

తుని మండలం హంసవరంలో రూ.12 కోట్లతో 132/33 కేవీ ఉపకేంద్రం నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. రూ.10.50 కోట్లతో ఎస్.అన్నవరం, రాజుపేట, అన్నవరం దేవస్థానం వద్ద 32/11 కేవీ ఉపకేంద్రాల నిర్మాణాలకు ఇప్పటికే భూమిపూజలు జరిగాయి. హంసవరం 132/33 కేవీ ఉపకేంద్రం ఏర్పాటుకు అనువుగా స్థలాన్ని ఎత్తు చేస్తున్నారు. ఈ ఉపకేంద్రం పది నెలల్లో పూర్తి చేసేందుకు వీలుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజుపేట, అన్నవరంలో ఏర్పాటు చేసే 32/11 కేవీ ఉపకేంద్రాలకు హెచ్‌టీ లైన్ వేసేందుకు విద్యుత్ స్తంభాలను తరలిస్తున్నారు.

అనేక ప్రయోజనాలు

ఈ ఉప కేంద్రాలతో విద్యుత్ సమస్యలు పరిష్కారం కానున్నాయి. ప్రస్తుతం అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో 132/33 కేవీ ఉపకేంద్రం నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఆ నియోజకవర్గంలో ప్రధానమైన విద్యుత్ సమస్యలు, మరమ్మతులు చేసేందుకు పాయకరావుపేటలో ఉన్న 132/33 ఉప కేంద్రంలో బ్రేక్ డౌన్ చేస్తున్నారు. దీంతో తుని పట్టణంతో పాటు తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. హంసవరంలో నిర్మిస్తున్న 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రంతో ఆ సమస్యలు పరిష్కారమవుతాయి. లోఓల్టేజీ పరిష్కరించబడి లోడ్ రిలీఫ్‌తో మంచి విద్యుత్ సరఫరాకు మార్గం ఏర్పడుతుంది. నియోజకవర్గంలో ఎక్కడైనా సాంకేతిక లోపం ఏర్పడితే హంసవరంలో ఉన్న 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో బ్రేక్ డౌన్‌తో మరమ్మతులు పూర్తి చేసుకోవడానికి వీలు పడుతుంది. తొండంగి మండలం సముద్ర తీర ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు దోహదపడుతుంది.

సాంకేతిక లోపాలు ఉండవు

నియోజకవర్గంలో 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుతో 33 కేవీ ఫీడర్లలో విద్యుత్ సరఫరాలో దూరం తగ్గి లోడ్ రిలీఫ్ లభిస్తుంది. వేసవిలో విద్యుత్ వాడకం అధికమైనా సాంకేతిక లోపాలకు తావుండదు. సరఫరాకు అంతరాయం ఏర్పడదు. దీంతో మంచి ఓల్టేజీతో విద్యుత్ సరఫరా జరుగుతుంది. అంతరాయం లేని విద్యుత్ సరఫరాతో వినియోగదారులు సంతృప్తిగా ఉంటారు.

– రత్నాలరావు, ఏడీఈ, తుని

క్లుప్తంగా

నేటి నుంచి గ్రామ సభలు

గండేపల్లి: కౌలుదారు కార్డులపై గురువారం నుంచి ఈ నెల 26 వరకూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి పి.సద్గురుమూర్తి తెలిపారు. గురువారం ఉదయం సూరంపాలెం, మధ్యాహ్నం యర్రంపాలెం, శుక్రవారం పి.నాయకంపల్లి, కె.నాయకంపల్లి, యల్లమిల్లి, శనివారం జెడ్.రాగంపేట, నీలాద్రిరావుపేట, సోమవారం తాళ్లూరు, బొర్రంపాలెం, 23న ఉప్పలపాడు, సుబ్బయమ్మపేట, మల్లేపల్లి, 24న సింగరంపాలెం, రామయ్యపాలెం, 25న కె.గోపాలపురం, ఎన్టీ రాజాపురం, 26న గండేపల్లి, మురారి గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు.

కోటనందూరు: రైతు భరోసా కేంద్రాల్లో గురువారం నుంచి కౌలుకార్డులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వ్యవసాయాధికారి కె.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఉదయం ఎస్సార్‌పేట, సాయంత్రం భీమవరపుకోట, 19న జగన్నాథపురం, మధ్యాహ్నం బొద్దవరం, 20న ఉదయం బిళ్లనందూరు, మధ్యాహ్నం ఉండుగపల్లి, 22న ఉదయం కేఈ చిన్నయ్యపాలెం, మధ్యాహ్నం పాతకొట్టాం, 23న ఉదయం కె.కొట్టాం, మధ్యాహ్నం కేఏ మల్లవరం, 24న ఉదయం కోటనందూరు, మధ్యాహ్నం కాకరాపల్లి, 25న అల్లిపూడి గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు.

శంఖవరం: మండలంలోని కౌలు రైతుల గుర్తింపు కోసం గురువారం నుంచి 23వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి పి.గాంధీ తెలిపారు. గురువారం శంఖవరం, మండపం, 19న గౌరంపేట, జి.కొత్తపల్లి, 20న వేళంగి, పి.మల్లాపురం, 22న కొంతంగి, నెల్లిపూడి, 23న కత్తిపూడి, నెల్లిపూడి గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు.

నేడు మండల పరిషత్తు సమావేశం

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హరికృష్ణ తెలిపారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు విచ్చేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని అన్నారు.

రేపు కౌన్సిల్ సమావేశం

తుని: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. సమావేశంలో పట్టణాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సభ్యులు చర్చిస్తారన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

హాజీలకు ప్రభుత్వం ప్రత్యేక సాయం


షేక్ ఖ్వాజా

తుని: హాజీల మక్కా యాత్రకు అవసరమైన ఆర్థిక సాయం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ముస్లింలు రుణపడి ఉంటారని జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హాజీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించిందని, హజ్ యాత్రకు వెళ్తున్న 1,814 మందికి ప్రభుత్వమే అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ముస్లిం యువతకు షాదీ తోఫా, పేదలకు నవరత్నాల ద్వారా ప్రభుత్వం మేలు చేస్తుందన్నారు. తుని నియోజకవర్గంలో మైనార్టీల సమస్యలకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ శాఖ మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో శాశ్వత పరిష్కారం లభించిందన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

జగ్గంపేట: వేసవి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, దీనిపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని రాజపూడి పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి తెలిపారు. అక్కడి పీహెచ్‌సీలో బుధవారం ఆరోగ్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానంగా ఎండ తీవ్రతతో శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఉపాధి కూలీలు, ఇతర పనులు చేసుకునే వారు జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. తరచూ నీరు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని, ఎండలో ప్రయాణాలు చేయరాదని, తెలుపు రంగు దుస్తులు ధరించాలని సూచించారు. హెచ్ఓ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా మెలగాలి

శంఖవరం: గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా మెలిగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నవరం ఎస్సై శోభన్‌కుమార్ తెలిపారు. స్థానిక సచివాలయంలో బుధవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామస్తులతో శాంతి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కమిటీ చూడాలన్నారు.ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, ఎంపీటీసీ సభ్యుడు అడపా వీరబాబు, నాయకుడు బైరా శ్రీరామమూర్తి, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి, పెద్దిపాలెం పీహెచ్‌సీల పరిధిలో డెంగీ జ్వరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఆయా వైద్యాధికారులు ఆర్‌ఆర్ పవన్‌కుమార్, ఐ.రత్నాలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలను లార్వా దశలోనే అంతం చెయ్యాలన్నారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు మీరితే చర్యలు


ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం రామన్న

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఆటో యూనియన్ నాయకులతో డిపో మేనేజర్ యు.రామన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు, ప్రైవేట్ వాహనాలను బస్టాండ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంచుకుని వ్యాపారాలు చేసుకోవాలన్నారు. రోజూ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ చెకింగ్ ఉంటుందని, ఈ నిబంధన మీరితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. డిపో సూపరింటెండెంట్ అడ్డాల అప్పారావు, టీఐ జి.కృష్ణ, ఆర్టీసీ యూనియన్ నాయకులు పైడిమళ్ల లక్ష్మణ్‌రావు, ప్రగడ ప్రసాద్, నల్లా సత్తిబాబు పాల్గొన్నారు.

రేపు 'వలంటీర్లకు వందనం'

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు (పద్మనాభుడు) వివరించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన బుధవారం జరిగింది. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతు సమస్యలపై పలువురు సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులతో వ్యవసాయ శాఖ అధికారులు సమావేశాలు నిర్వహించి సాగుపై తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు అందజేయడం లేదన్నారు. ఎమ్‌టీయూ 1156 వరి వంగడం పంటను అధికారులు తీసుకోవడం లేదన్నారు. రైతులు తమ పండించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించినప్పుడు వాహనాలకు రవాణా ఖర్చులు ఇవ్వడం లేదన్నారు. దీనిపై ఏఓ రాజేశ్వరి మాట్లాడుతూ ఈ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రంపయర్రంపాలెంలో ఇటీవల పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలు కోర్టు వివాదంలో ఉన్నాయని, రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు ఆరోపించారు. అలాగే భూముల రీసర్వేపై రైతులకు ఎటువంటి ధ్రువపత్రాలు ఇవ్వడం లేదన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ భూ సర్వే పూర్తయిన రెండు రోజులలో సర్వే పత్రాలు రైతులకు ఇస్తామన్నారు. గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య అధికంగా ఉంటుందని, రోగులకు ఇబ్బంది లేకుండా టోకెన్ సిస్టం అమలు చేయాలని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, ఎంపీడీఓ కేవీఎస్ఎస్ఎన్ మూర్తి, వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, గోకాడ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

పల్లెల ప్రగతికి ప్రాధాన్యం

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పల్లెల ప్రగతికి ప్రాధాన్యం ఇస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. స్థానిక బ్రహ్మల కాలనీలో శిథిలావస్థకు చేరిన సీసీ రోడ్డు స్థానంలో రూ.5 లక్షలతో రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. బంగారాళాపేటలోని డ్రైనేజీ నిర్మాణానికి, ఊరకాలువలోకి మెట్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అలాగే 11 కేవీ విద్యుత్ సమస్య గురించి బంగారాళాపేట వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, బిజ్జి రాజు, రౌతు జోగేశ్వరరావు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మల కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

మహాసభల విజయవంతానికి పిలుపు

ప్రత్తిపాడు రూరల్: అనకాపల్లిలో 25న జరిగే అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకుడు మానుకొండ లచ్చబాబు అన్నారు. ఈ మేరకు చింతలూరు, వెంకటనగరం గ్రామాల్లో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలన్నారు. లిబరేషన్ పార్టీ నాయకులు తాడి నాగేశ్వరరావు, దుమ్ముల సింహాచలం,లోడ అప్పారావు, మాస రాజమణి, కాద సత్యవతి, తాడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


చింతలూరులో ర్యాలీ చేస్తున్న లిబరేషన్ పార్టీ శ్రేణులు

అర్జీలను సత్వరం పరిష్కరించండి

ఆర్డీఓ సీతారామరాజు

జగ్గంపేట: మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన అర్జీలను తక్షణం విచారణ చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పెద్దాపురం ఆర్డీవో సీతారామరాజు సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ శ్రీదేవి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎల్.నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ భద్రతకు చర్యలు

ఏలేశ్వరం: ఏలేరు కాలువ మీదుగా ఏర్పాటు చేసిన పైపులైన్ భద్రతకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో సీతారామరాజు తెలిపారు. తిరుమాలిలో ఏలేరు కాలువ మీదుగా హెచ్‌పీసీఎల్ గ్యాస్ పైపులైన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఏలేరు కాలువలో అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టడంతో పైపులైన్ దెబ్బతిందని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆర్డీఓ సీతారామరాజు ఇరిగేషన్ అధికారులు, పైపులైన్ సంబంధిత అధికారులతో కలసి పైపులైన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక తవ్వకాలతో పైపులైన్ దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ సూరపరాజు పాల్గొన్నారు.


ఏలేరు కాలువలో పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామరాజు

వేసవి దుక్కులతో చీడపీడల నివారణ


కేఓ మల్లవరంలో మాట్లాడుతున్న ఏఓ అశోక్‌కుమార్

తుని రూరల్: వేసవి దుక్కులతో పురుగులు, వాటి అవశేషాలు తొలగించవచ్చని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం కేఓ మల్లవరంలో రబీ పొలంబడి క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలో పేరుకుపోయిన పురుగులు, వాటి అవశేషాలు వేసవి దుక్కులతో పోతాయన్నారు. భూసార పరీక్షా ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వాడుకోవడంతో నేలలు ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీర్రాఘవులు, మాజీ సర్పంచ్ ఏకా కన్నయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు డొంక వెంకట బెనర్జీ, ఏఈఓ పి.జగ్గప్పారావు పాల్గొన్నారు.

కోటనందూరు: పంటకోత ప్రయోగాల ఆధారంగా రబీలో ఎకరానికి 36 బస్తాల వరకూ దిగుబడి రానున్నట్లు గుర్తించామని ఏఈఓ శివకుమారి తెలిపారు. కాకరాపల్లిలో పంటకోత ప్రయోగం చేశారు. రైతు బంటుపల్లి రమేష్ వరి పొలంలో 5/5 మీటర్ల విస్తీర్ణంలో పంట కోసి నూర్పిడి చేయగా 18 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. ఏఎస్ఓ వామనమూర్తి, వీఏఏ నల్లమిల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా: మంత్రి రాజా


మంత్రి రాజాకు వినతిపత్రం అందజేస్తున్న 104, ఎంఎంయూ సంఘ సభ్యులు

తుని: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. బుధవారం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంప్ కార్యాలయంలో ఏపీ, ఎంఎంయూ ఉద్యోగుల సంఘం నాయకులు కలసి ఆయనకు వినతిపత్రం సమర్పించారు. 104, ఎంఎంయూ వాహన సేవలను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, జీవో నంబరు 4459 ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, చెల్లించాల్సిన కాంట్రిబ్యూషన్‌ను అరబిందో యాజమాన్యం అందించాలని సభ్యులు వినతిపత్రం అందించారు. అన్ని అంశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి రాజా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీకాంత్, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యం


తునిలో పార్కు సుందరీకరణపై ఆర్కిటెక్ట్‌తో చర్చిస్తున్న ఏలూరి బాలు

తుని: పట్టణ సుందరీకరణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వైఎస్సార్ సీపీ యువత అధ్యక్షుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్, గణపతి నగర్ పార్కులను రాజమహేంద్రవరానికి చెందిన ఆర్కిటెక్ అండ్ డిజైనర్ పృథ్వీతో కలసి సందర్శించారు. ఆయా పార్కుల అభివృద్ధిపై సూచనలు చేశారు. పార్కులకు వచ్చే ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా తీర్చిదిద్దాలని చెప్పారు. మున్సిపల్ పార్కులో ఇటీవల నిర్మించిన స్కేటింగ్ రింగ్, పిల్లల ఆట స్థలం, వాకింగ్ ట్రాక్, స్కేటింగ్ రింగ్ గ్యాలరీ, కృష్ణుని విగ్రహం ఏర్పాటు, స్వాగత గేటు తదితర అంశాలపై చర్చించారు. అలాగే గణపతి నగర్ పార్కులో వాకింగ్ ట్రాక్, జిమ్, పిల్లల ఆట స్థలం, ప్లేకోర్టు, కాంపౌండ్ వాల్, ఎంట్రన్స్, లైటింగ్ తదితర అంశాలపై మాట్లాడారు. అత్యాధునిక హంగులతో పార్కులను తీర్చిదిద్దాలని ఆర్కిటెక్ట్ పృథ్వీకి సూచించారు. జిల్లా వక్ఫ్‌బోర్డ్ వైస్ చైర్మన్ షేక్ క్వాజా, మున్సిపల్ ఏఈ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందన

కోటనందూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపీపీ లగుడు శ్రీనివాసు అభినందించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. 10వ తరగతిలో 558 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన బొద్దవరం హైస్కూల్ విద్యార్థిని నీలి కావ్యశ్రీ, 557 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన కోటనందూరు హైస్కూల్ విద్యార్థిని గంటా తులసీ, 536 మార్కులతో మూడో స్థానంలో నిలిచిన అల్లిపూడి కేజీబీవీ విద్యార్థిని అల్లు దేవిలను సత్కరించి బహుమతులు అందజేశారు. పక్కా ప్రణాళికతో ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని ఎంపీపీ ఆకాంక్షించారు. సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొరుప్రోలు కృష్ణ, దొడ్డి బాబ్జీ, సుర్ల రాజు, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి శ్రీను, కోఆప్షన్ సభ్యుడు జిగటాల కోట సత్తిబాబు, పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, హెచ్ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

మాతృ భాష తల్లిలాంటిది


ఏలేశ్వరం గ్రంథాలయంలో శిక్షణ శిబిరంలో విద్యార్థులు

ఏలేశ్వరం: మాతృ భాష తల్లిలాంటిదని విశ్రాంత ఉపాధ్యాయుడు శిడగం దొరయ్య అన్నారు. గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు మాతృభాష, తల్లిదండ్రుల విశిష్టతలపై వివరించారు. స్థానిక శాఖా గ్రంథాలయ ఆవరణలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దొరయ్య మాట్లాడుతూ మాతృభాషపై మమకారం కలిగి ఉండాలన్నారు. ఎన్ని జన్మలెత్తినా తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేమన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు మామిడి రాము విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు.

నిర్లక్ష్యం.. నిరుపయోగం


ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి వద్ద నిరుపయోగంగా బస్ షెల్టర్

ఏలేశ్వరం: భవనాలున్నా అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. ప్రయాణికులకు నీడ కల్పించేందుకు ఏలేశ్వరంలో దాతలు నిర్మించిన బస్ షెల్టర్లు ఎందుకూ కొరగాకుండా ఉన్నాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద దాతలు బస్ షెల్టర్‌లు నిర్మించారు. దీనికి ఆలనా పాలన లేక నిరుపయోగంగా ఉన్నాయి. ఇందులో చెత్త పేరుకుపోవడంతో లోపలకు వెళ్లేందుకు ప్రయాణికులు సాహసించడం లేదు. దీనికితోడు మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతుంది. రోజూ వీటిని పరిశుభ్రం చేయిస్తే ప్రయాణికులకు ఉపయోగపడుతుందని, దాతల ఆశయం నెరవేరుతుందని స్థానికులు అంటున్నారు.

క్రైం కార్నర్..

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై రవికుమార్

తొండంగి: గంజాయి తరలింపు, విక్రయం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, సహకరించినా చర్యలు తప్పవని తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ అన్నారు. బుధవారం బెండపూడి శివారు ఎస్ఆర్ రెసిడెన్సీలో లాడ్జిల యజమానులు, ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అన్నవరం పుణ్యక్షేత్రం కావడంతో సరిహద్దు ప్రాంతమైన బెండపూడి శివార్లలో దాబాలు, లాడ్జిలను ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. దీనికి సహకారం అందించిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు.

సారా విక్రేత అరెస్ట్

గండేపల్లి: సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు గండేపల్లి పోలీసులు తెలిపారు. మురారి శివారు అరుంధతి పేటలో బుధవారం సారా విక్రయిస్తున్న దొంగ దేవిని అరెస్టు చేసి ఆమె నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నమ్మించి మోసం..

ప్రత్తిపాడు: బాలికను మోసగించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం.పవన్‌కుమార్ తెలిపారు. బురదకోట గ్రామానికి చెందిన మాడెం గణేష్ కె.మిర్తివాడకు చెందిన బాలికను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మొహం చాటేశాడు. ఆమె ఫిర్యాదు మేరకు పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి పోక్సో కేసు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, హైవే అంబులెన్స్ సిబ్బంది కథనం ప్రకారం.. కె.గోపాలపురం గ్రామానికి చెందిన రాణి, మంగాయమ్మ, శ్రీను మోటార్ సైకిల్‌పై వస్తూ మల్లేపల్లి సంత మార్కెట్ ఎదురుగా ఉన్న మార్గం వద్ద జగ్గంపేట వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వారి మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న లారీ రాణి ఎడమచేతి పైనుంచి దూసుకుపోయింది.

రాణి ఎడమ చెయ్యి నుజ్జునుజ్జు కాగా మంగాయమ్మ, శ్రీనులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రురాలికి ప్రథమ చికిత్స అందించి తర్వాత రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.